# సిందూరం

"ఏ గంగలో నన్నా దుంకి చావనన్నా ఛస్తానుగాని ఆ చాయలోనికి నా గంగనిచ్చి పెండ్లి చెయ్యను చెయ్యనంటే చేయ్యను. "

అమాయకుడనుకున్న వెంకయ్య అగ్గిమీద గుగ్గిలమై చిటపట లాడ్తుంటే అవాక్కయాను

కలుపు గోలుగా మాట్లాడ్తాడు. పెళ్లిల్లు పేరంటాల్లో కమ్మని వంటలు చేసి పెడతాడు. కాయకష్టంతో కాలం వెల్లబుచ్చుతున్న మా పక్కింటి వెంకయ్య వంటల వెంకయ్యగా ఊరందరికి తెలుసు. నీతి నిజాయితీలను నమ్ముకున్న మనిషి ఆత్మను అమ్ముకోలేడుగదా! అందుకే నాలుగురాళ్లు వెనకేసుకోలేక పోయాడు పాపం! మగ సంతానం లేనివాడు. గంగ, యమున, సరస్వతి... ముత్యాల్లాంటి ముగ్గురాడ పిల్లల్ని... ఉన్నంతలో ఏలోటూలేకుండా అల్లారు ముద్దుగా పెంచాడు. కన్నె పిల్లలు కల్యాణఘడియల కోసం ఎదిరి చూస్తూన్నారుగాని. కాసులు కూడలేదు. కట్నాల మార్కెట్లో వరుల ధరవరలు వరుసగా పెరిగి పోతున్న రోజులాయే. ముగ్గురు కూతుళ్ల మెడలో మూడుముళ్లు వేయించాలని ముప్పతిప్పలు పడ్తున్నాడు.

నాకేమో ఉద్యోగ బాధ్యతతో ఊపిరాడదు. ఆదివారం ... వారానికి దొక్కరోజే రిలీఫ్ అలస్యంగా నిద్రలేచాను. చాయ చప్పరిస్తూ వార్తా పత్రికలో మునిగిపోయాను. అప్పుడే... వెంకయ్య పాలికేకలేస్తూ వచ్చి సీమటపాకాయలా పేలిపోతాడనుకోలేదు.

"చాయలో డంటే . ఆ మొబైల్ టీ కొట్టు ... అదే... ఓ భుజానికి ప్లాస్కులు మరోభుజానికి ప్లాస్టిక్ గ్లాసుల సంచీతో

బజార్లో తిరిగి దుకాణాల్లో చాయలమ్ముతుంటాడు  అతడేనా?" అడిగాను.

"ఆ . . వాడే వానింటి మంగట్నే ఉన్నడుగదా! మొకం జూస్తే మర్యాదా పురుషోత్తమునోలున్నడు గాని  నా గంగ బతుకుతోని ఆడుకుంటున్నడు సారూ! .." కొంపలంటుకున్నట్టు గుండెలు బాదుకున్నాడు.

"అం టే ఏంజేసిండు?" నా భార్య చాయ అందిస్తూ "కూచో అన్నా!" అంది రెండు గుక్కల్లో చాయ కప్పుల ఖాళీచేశాడు వేడిచాయ అవేశాన్ని అణిచేసినట్టుంది.

"ఇంకేం జెయ్యాలమ్మా! మా గంగ గూడా వాణ్నే పెండ్లిజేసుకుంట నంటున్నది లేకపోతే విషం దాగి ఛస్తదటా!. నుదురు కొట్టుకున్నాడు.

ఎంగ ఘాటు ప్రేమయో .. కొంత లేటు వయసులో! . అనుకన్నాను

"గంగ ఇప్పుడెక్కడుందన్నా!" ముక్కుమీద వేలేసుకుంది నాభార్య.

"మా ఇంట్లనే ఉందమ్మా!'' కుర్చీలో కూచోబోయి అగిపోయాడు. అతని వింత ప్రవర్తన నాకుగిలింతలు పెట్టింది నవ్వాపుకున్నాను.

"అమాత్రానికే అంత పరేషానా?" ఎగాదిగా చూశాను. అతని కళ్ళు అందోళన, అవేదనతో నిండున్నాయి.

"పరేషాన్ గాక ఇంకేముంది సారూ? ఎంత చెప్పినా గంగ వినడం లేదు. వాళ్లమ్మ లెంపలు వాయించింది. అయినా ఆ కోన్‌కిస్కాగాడు ఎక్కడ పుట్టిండో... ఎట్లా పెరిగిండో! ఇల్లూ ముంగిలి లేనోనికి పిల్లనిస్తే... వాడు తల్లెముంత అమ్ముకుని తాగితందనానలాడి ఉడాయించుకపోతే దాని గతేంది బాబూ!" కల్లనీళ్ల పర్వంతమయాడు

ముగ్గురాడ పిల్లల పెళ్లిళ్లు చేయలేక మూడు చెర్ల నీళ్లు దాగుతున్న వెంకయ్యే నేనా ఇతడు! చిన్నమ్మాయి పెద్దమనిషై ఏడెనిమిదేండ్లైంది. ఏదో రకంగా ఓ గ్రహాన్ని వదిలించుకోవచ్చు గదా!

"చూడు వెంకయ్యా!" సముదాయింపుకుదిగాను" ఆ రమేష్ అదే. ఆ మొబైల్ టీకొట్టు . మనూరికొచ్చి చాలా రోజులైంది. పిల్లాడైతే బతకనేర్చినోడు బాగానే ఉన్నాడుగదా!"

రెండు చేతులు నెత్తిమీదుంచుకుని గబుక్కున కూచున్నాడు అది కోపమో, తాపమో. అర్థంకాలేదు ఓ నిముషమాలాగే ఉండి...

"మీ బిడ్డయితే ఏంజేసేవారు సారూ?" సూటిగా అడిగేశాడు ప్రశ్న అంతసూటిగా వస్తుందనుకోలేదు. ఆ ప్రశ్నాబాణం నా గుండెలకు సూటిగా తాకి తల్లడిల్లజేసింది

అవును నాకూతురే అయితే ఏంజేసేవాణ్ని? నాలో కలకలం బయలుదేరింది బుర్రచించి అలోచించాను చేతనైన సాయం చేస్తానన్నాను. అచాయలోని బతుకు బట్టబయలు చెయ్యాలి

* * * *

మా పారుపల్లి వీధి వారికి పటాతోపం తక్కువ పిల్లినడకలా సంసారాలు గుట్టుగా సాగిపోతుంటాయి. కష్టాలను కడుపులో దాచుకుంటారు. భ్రమలు పెంచుకోరు కాబట్టి భంగపాట్లుండవు.

వెంకయ్య నా వెంటున్నాడు. దర్జాగా రమేష్ ఇంట్లో కెళ్లాం. అదివారం బజారు బంద్ కాబట్టి రమేష్ గ్గూడా సెలవే. అభ్యంగన స్నానమాచరించిన అడపిల్లల్లా గది శుభ్రంగా ఉంది. పాలగిన్నె, ఫ్లాస్కులు కడిగేస్తున్నాడు. రమేష్.

"రండి రండి!" మర్యాదగా లేచినుంచున్నాడు.

ముందు మర్యాదచేసి ఆ తర్వాత మమ్మల్ని కడిగెయ్యడుగదా! కళ్లతో కర్చీలు చూపించాడు నాలుగు ప్లాస్టిక్ కుర్చీల్లో రెండింటి నాక్రమించాము. రమేష్ ముఖకవళికల్లో చెప్పుకోదగ్గ మార్పుల్లేవు. సిగ్గు, బిడియం, భయం మచ్చుకైనాలేవు అన్నీ కడిగి, తుడిచి, అందంగా సర్దేశాడు. తువ్వాలుతో చేతులు తుడుచుకుంటున్నాడు. మేము మొహాలు చూసుకున్నాం.

"కూచో రమేష్!" నాచూపు లతణ్ని అపాదమస్తకం తడుముతున్నాయి. నిమ్మపండు దేహఛాయ, చక్కని ముక్కు, చలాకి కళ్లు. . కాశ్మీర్ అపిల్‌లాగున్నాడు. వయసు ముప్పైలోపే. ఫ్లాస్కులోంచి చాయవంచి మాకందించాడు

" ఫరవాలేదండీ " అంటూ నుంచున్నాడు అతని చేతిలో గూడా చాయగ్లాసుంది.

"ఊహు! ముందు కూచో" అంటూ తృప్తిగా చాయ్ సిప్‌చేశాను. ఆహా! ఇది చాయనా లేక స్వర్గలోకంలో తయారైన సురాపానమా! వెంకయ్య మొహం విచిత్రంగా మారింది అతనిలో కొపతాపాలు కొట్లాడు కుంటున్నాయెమో! చాయతాగు మని కళ్లతో సైగచేశాను. ఆచరించి కూచున్నాడు

నాణ్యమైన చాయ నరాలవాడిని, వేడిని సమతూకం చేసింది.

"రమేష్! మనదేవూరు? అమ్మానాన్న లెవరు బాబూ!" ఎందుకైనా మంచిదని అనునయంగా అడిగాను

"అదంతా మీకెందుకు?" అంటాడనుకున్నాను కాని అలా అనలేదు. మేమెందుకొచ్చామో అతని కర్థమై పోయినట్టుంది. మొహంలో రంగులు మారాయి. అది భయమో, భక్తో అర్థంకాలేదు

"చెప్పునాయనా !" వెంకయ్య అదుర్దా

" ఏ ఊరంటే ... నేను పుట్టి పెరింగింది శ్రీనగర్లో .." వినగూడనిదేదో విన్నట్లు... మాచూపుల్లోని వైచిత్రి అతన్నో బొమ్మగా మార్చేసింది.

"అంటే.... జమ్మూ కాశ్మీర్ రాజాధానేనా?" నా కనుబొమలెగిరినై

"అవును... అదే....."

"మరైతే నీకు తెలుగెట్లా వచ్చింది?" వెంకయ్య అదుర్దా ప్లస్ ఆసక్తి.

"చెప్తా వినండి" కుర్చీలో సర్దుక్కూచున్నాడు. రమేష్ చూపులు శూన్యంలోకి విస్తరించినై. మా నాన్న పుట్టింది ఈ ఊరు... అంటే ఈ సిద్దిపేటలోనే. చిన్నప్పుడే కన్నవాళ్లను పోగొట్టుకుని హైద్రాబాద్ చేరుకున్నాడట. మోజంజాహీ మార్కెట్లో ఓ హోల్‌సేల్ పండ్ల వ్యాపారి వద్ద గుమాస్తాగా చేరాడట. నీతి నిజాయితీలతో కష్టపడి పంజేస్తూ యజమానికి విశ్వాసపాత్రుడైనాడట. అప్పటివరకా యజమాని స్వయంగా శ్రీనగర్ వెళ్లి అపిల్‌పండ్లు, ఖరీదు చేసి హైద్రాబాద్‌కు తరలించేవాడట. లాభాలతో పాటు వ్యాపారం పెరిగింది

తన ఏజెంట్‌గా మానాన్నను శ్రీనగర్లో ఉంచేశాడట ఆ ధర్మాత్ముడే ఓ అనాథ తెలుగు అమ్మాయితో మానాన్న పెళ్లి హైద్రాబాద్‌లో జరిపించాడట అందాల కాశ్మీర్లో మా అమ్మానాన్నలు కొంతకాలం హాయిగా ఉన్నారట మా అన్నయ్య, నేను చెల్లి అక్కడే కళ్లు తెరిచాము. ప్రకృతి ఒడిలో పరవశించాము. అడుతూ పాడుతూ చదువులు సాగించాము మా అన్నయ్యకు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం దొరికింది అక్కడమ్మాయితోనే పెళ్లైంది

బయట హిందీ, కాశ్మీరీ మాట్లాడినా ఇంట్లో తెలుగులోనే మాట్లాడుకునే వాళ్లాం మా అమ్మ అమృతమూర్తి, దయామయి అమెనే మా చేత తెలుగు అక్షరాలు దిద్దించింది పెద్దబాల శిక్ష తర్వాత రామాయణం భారత, భాగవతాలు తెలుగులో చదివించింది

కాశ్మీర్లో హిందువులు మైనారిటీలు, ముస్లిం జనాబా పెద్దది అయినా పాలూనీళ్లలా అంతా కలిసిమెలిసి ఉండేవాళ్లం. అక్కడ తెలుగువాళ్లు చాలా తక్కువ. పెళ్లిళ్లు పేరంటాల్లో కలిసి కులాసాగా గడిపేవాళ్లం తేనెలొలికే తెలుగుభాష గురించి, తెలుగు తేజముగురించి గొప్పగా చెప్పుకునే వాళ్లం. మనసులు విప్పి మాట్లాడుకునే వాళ్లం

"చిన్నతనములో మతమంటే ఏమిటో తెలీదు. రానురాను పాకిస్తాన్ ప్రభావం ఎక్కువైంది. పరిస్థితిలో మార్పు చోటుచేసుకుంది. మతమౌఢ్యం జడులువిప్పింది. హిందువుల మీద దాడులధికమైపోయినై. భయం గుప్పిట్లో బతకలేక ఎన్నో కుటుంబాలు తరలిపోయినై. మేము మాత్రం ధైర్యంగా ఉన్నాము. మేమే మా వదినకు తెలుగునేర్పాం

మా బస్తీలో మూన్నాల్గు తప్ప మిగితావన్నీ ముస్లిం కుటుంబాలే. బస్తీలోని ముస్లిం మిత్రులతో కలిసి సినిమాలకు, బోటు షికార్లకు వెళ్లేవాళ్లం కాలేజికి కలిసివెళ్లేవాళ్లం చెల్లికూడా అంతే. కాశ్మీర్ కన్యలతో సరదాగా గడిపేది.

సృష్టికర్త అందాలన్నింటినీ అక్కడే కుమ్మరించాడేమో. ఎటు చూసినా పూలతోటలు, జలజలపారే సెలయేళ్లు, పిల్లగాలి తరంగాలకు తలలూపుతూ కూనిరాగాలు దీసే కొమ్మారెమ్మలు... మూగవానిగ్గూడా సంగీతం నేర్పిస్తాయి. తటాకాలు, సరస్సుల మీద తేలి ఆడే పడవఇళ్లు, కళ్లు చెదిరే రంగుల హంగులు... స్వర్గాన్ని తలపిస్తాయి. మంచుకొండల మీద స్కేటింగ్ చేస్తుంటే కైలాసములో పరుగెడుతున్నట్టనిపిస్తుంది. అదొక తియ్యని అనుభూతి

నేను డిగ్రీ ఫస్టుక్లాసులో పాసయాను ఏనుగెక్కి ఊరేగినంత సంతోషమైంది మా ఇంటిపక్కనున్న మొహియొద్దీన్ చాచా సాయంతో నాకు ఉద్యోగం దొరికింది అప్పుడు నామనసు మబ్బుల పట్టిన అకాశాన్ని చూసిన మయురములా డాన్స్ చేసింది
అటు హైద్రాబాదులో యజమాని మరణించగానే ఇటు మా నాన్న ఉద్యోగ మూడిపోయింది మా అమ్మ కంటతడి పెట్టింది.

"మన వాళ్లమీద రోజువారి అత్యాచారాలు పెరిగిపోయున్నై మన మిక్కడుండటం క్షేమం గాదు మనం . మన హైద్రాబాద్ కెళ్లి హాయిగా బతుకుదాం. కాయకష్టం చేసినా సరే... కంటినిండా నిద్రబోదాం " నాన్నను బతిమాలింది. నాన్న ధైర్యం వీడలేదు

"బతుకు బాటలో ఆటంకాలొస్తూనే ఉంటాయి అంత మాత్రన బాటనొదిలేస్తామా? ధైర్యంగా ఆటంకాలనెదిగిస్తూ ముందుకు పోవాలె. అయినా.... మన కొడుకులిద్దరూ ఉద్యోగాల్లో ఉన్నారు మనకేం తక్కువైందని ఈ శ్రీనగర్ను వదలి వెల్దాం?"

"అదికాదు మావయ్యా, ఇక్కడ హిందువులకు రక్షణలేకుండా పోయింది. దినదిన గండంగా గడపాల్సివస్తుంది. " అక్కడే పుట్టి పెరిగిన వదిన గూడా వంత పాడడం ఆశ్చర్యమన్పించింది అన్నయ్య వెంటనే కల్పించుకున్నాడు.

"నోరు మంచిదైతే ఊరు మంచిదన్నారు. మనమిక్కడే పుట్టాం, ఆడుకున్నాం పాడుకున్నాం. ఇది మన మాతృభూమి "

"తెలుగు నేలగూడా మన మాతృభూమిలో భాగమే గదా "

"అబ్బా .... చర్చ అనవసరం. చావైనా బతుకైనా ఇక్కడే తేల్చుకుందాం."

రోజులు గడుస్తున్నై ఐ.యస్సై శిక్షణ పొందిన మిలిటెంట్ల ఆగడాలు పెరిగిపోయిన్నై. ప్రార్థనా స్థలాల్లో పురుడుపోసుకున్న జీహాద్ కొందరి మనసుల్ని మలినం చేసింది. జె.కె.ఎల్.ఎఫ్, హిజబుల్ ముజాహిదీన్,లష్కరేతోయిబా మరెందరో మిలిటెంట్లు, వాళ్ల ఆగడాలు అనంతమై పోయిన్నై. ప్రతిఘటించిన ప్రగతి శీల ముస్లిముల ప్రాణాలు తుపాకి తూటాలకు బలై పోతున్నై లూటీలు, గృహ దహనాలు, మానభంగాలు, రోజువారీ కార్యక్రమాలైపోయిన్నై అయినా కాశ్మీర్. శ్రీనగర్పట్ల మా మమాకారం తగ్గలేదు

ఓసారి మా మిత్రులతో సినిమాకెళ్లాను థియేటర్లో కూచున్నాం ఇంకా సినిమా ప్రారంభం కాలేదు పిచ్చాపాటి ముచ్చట్లకు దిగాము

"ఏనాటికైనా కాశ్మీర్ పాకిస్తాన్‌లో కలిసిపోతుందేమో!" పెదవి విరిచాడో మిత్రుడు

నా నరాల్లో రక్తం కుతకుతలాడింది " ఇంపాజిబుల్" అరిచాను " కాశ్మీర్‌ను భారత్‌నుండి విడదీసే శక్తి ఈ ప్రపంచములో ఎవ్వరికీ లేదు " పిడికిళ్లు బిగుసుకుపోయినై

"ఇప్పుడట్లానే అన్పిస్తుంది. జీహాద్ పుణ్యమాని మైనారిటీ కాఫిర్లంతా కనుమరుగైపోతారు అప్పుడే మవుతుందో నకేందెల్సూ"

"ఈరాష్ట్రంలోని మైనారిటీలే ఇతర రాష్ట్రాల్లో మెజారిటీలు ఆ రాష్ట్రాల్లో మెజారిటీలు ఇలాగే విజృంభిస్తే "

సినిమా ప్రారంభమైంది. కాశ్మీర్‌నుభారత్‌నుండి విడిపోనివ్వద్దు. . అశయం శాంతింపజేసింది.

శుక్రవారము నాడు అమ్మానాన్నలు గుడికెళ్లారు తిరిగిరాలేదు కత్తిపోట్లకు గురై దిక్కులేని చావు చచ్చి నడిబజార్లో పడున్న వాళ్ల శావాలను ఇంటికి మోసుకొచ్చినం బస్తీలోని ముస్లిం మిత్రుల సాయంతో అన్నమో రామచంద్రా అంటూ అంత్యక్రియలు పూర్తి చేసినం.

లోకమంతా చీకటిగా.. చిమ్మచీకటిగా కన్పించింది.

ఎక్కడోపుట్టి, ఎక్కడో పెరిగిన అమ్మా నాన్నలు జీవితమంతా కష్టాలు కడలినీదుతూ కాశ్మీర్లో ప్రాణాలొదిలారు. అక్కడే పుట్టి పెరిగిన మేము... వాళ్లను రక్షించలేక పోయాం... గోడు గోడు మన్నాం మనసు గాయాలకు కాలమే వైద్యం చేస్తుంది గదా! పైగా మా అశయ మొకటుందాయె కొద్దిరోజుల్లో కుదుట బడ్డాం

చెల్లి పెళ్లి ప్రస్తావన వచ్చింది వదిన నిలువెల్లా వణికిపోయింది

"చూడండి!" సీరియస్‌గా చెప్పింది " ఇక్కడున్న మన కుటుంబాలు జమ్మూకు తరలి వెల్తున్నై. ముందు ముందు జమ్మూగూడా జబర్దస్తీకి గురికావచ్చు, మనం మీ సిద్ధిపేట కెళ్లిపోదా మీరు కూలీ పంజేసినా నేను నాలుగిళ్లల్లో పాచిపంజేసినా సరే అక్కడ ప్రశాంతంగా ఉందాం మరదలుకు, మరిదిగారికి అక్కడే పెళ్ళిసంబంధాలు చూద్దాం నామాట వినండి " చేతులెత్తి దండంబెడుతూ బతిమాలింది

"నిజమే! ఇక్కడ మైనారీల బతుకులు అగాధమైపోయినై " అన్నయ్య వదినకు వంత పాడతాడనుకున్నాను " పరిస్థితులు వేగంగా మారిపోతున్నై హిందువులు మీద అత్యాచారాలు నిత్యకృత్యాలైపోయినై. కాని... ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని పారిపోయిన కాశ్మీరీ పండితులు నిలువ నీడలేక ఢిల్లీ పేవ్‌మెంట్ల మీద అడుక్కుతింటున్నారు. తెల్సా! ఊరకుక్కల కంటే అధ్వాన్నంగా బతుకులీడుస్తున్నారు. ఎక్కడికో పారిపోయి జీవచ్ఛవాల్లా బతికే బదులు చావో బతుకో ఇక్కడే తేల్చుకుందాం." కరాఖండిగా చెప్పేశాడు. వదిన అవేదన కన్నీరై ధారలు సాగింది.

"నహీ! నామాట వినండి మరిదిగారూ! జెర మీరన్నా మీ అన్నయ్యకు చెప్పండి......."

"ఏం చెప్పాలివదినా!" నాలో ఉద్వేగం, అవేశం పొంగినై కాశ్మీరం భూతల స్వర్గము. ఇది మన భారత మాత నుదుటి సిందూరము. శ్రీనగర్ ఆతల్లి బుగ్గన చుక్కలాంటిది..."

"ప్రకృతి అందాలు ప్రాణాలను రక్షిస్తాయా?" వదిన గొంతు కీచుమంది. "కొంత మంది మతోన్మాదుల మారణ హోమాన్ని అరికడ్తున్నాయా? దుర్మార్గుల ఆగడాలకు అడ్డుగానిలుస్తున్నాయా?" పాపం దుఃఖం ఉప్పెనలా పైకి వచ్చిందేమో వెక్కి వెక్కి ఏడ్చింది

ఏదన్నా ప్రమాదం ముంచుకొస్తే, చిన్నప్పట్నుంచి కలిసి ఆడుకున్న అక్బర్, కరీం, జహంగీర్ లాంటి ప్రాణమిత్రులు మమ్మల్నాదుకోరా! ఇక్కణ్నుండి హిందువులంతా పారిపోతే ప్రగతిశీల ముస్లిముల గతేమిటి? వాళ్లుగూడా జీహాద్ దాహానికి లొంగిపోతారు అప్పుడు వాళ్లే ఈదేశానికి శత్రువులైపోతారు. భయమేసింది.

"ఈమట్టితో మన అనుబంధం అంత సులువుగా తెగిపోతుందా వదినా? ఇక్కడి సరస్సులు, మంచుకొండలు, పూలతోటలు మనల్ని పెంచి పోషించినై, మన శరీరం లోని అణవణువూ ఇక్కడి చెట్టూచేమ, కొమ్మారెమ్మల పలుకరింపుతో పులకరించిపోతుంది. పైగా ఇది మన పరువు ప్రతిష్ఠలకు సంబంధించిన విషయం, పరువు పోయాక ప్రాణాలతో ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే." మొండిగావాదించాను

పాపం! వెక్కిళ్లతో తడబడుతున్న వదిన ఇంకేమీ అనలేదు. మా అమ్మానాన్నల ఫోటోకు సమస్కరించి "మీరు పుణ్యమూర్తులు ఇంకా నేనెన్ని విపరీతాలు చూడాలో, ఎన్ని బాధలనాభవించాలో!" అని చెల్లిని కౌగలించుకు బోర్‌మంది ఎద పొదలోని అల్లరిని అతిప్రయత్నమ్మీద ఆపుకుంటూ చెల్లి వదినను ఓదార్చింది.

బడబాగ్నుల పొగలు, సెగల్ని కడుపులో దాచుకున్న ప్రశాంత సముద్రిడిలా-నా అంతరంగములో చెలరేగిన మంటల్ని అలాగే అదిమిపెట్టి నేను పైకి శాంతమూర్తిలా కన్పించాను. చెల్లి, అన్నయ్యల పరిస్థితి కూడా అదే కావచ్చు.

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల పరిస్థితిలో మార్పు వస్తుంది. దుష్టసంహారం జరిగితీరుతుంది. తిరిగి కాశ్మీర్లో శాంతిపూలు వికసిస్తాయి.... ఆశ కట్టి పడేసింది

ఆరోజు... ఫస్ట్ తారీకు, సాయంత్రం చెల్లికి పెళ్లిచూపులు నైట్ డ్యూటీ ముగించుకుని అన్నయ్య పొద్దున్నే వచ్చాడు.

నెను డ్యూటీ కెళ్లాను సాయంత్రము జీతం అందుకుని స్వీట్సు, పళ్లు వగైరాలు కొనుక్కుని ఆటో ఎక్కాను

..... మా గుండెలమీదాడుకున్న చెల్లి బావగారి గుండెల్లో గూడుకట్టుకుంటుంది పెళ్లిలో బావగారినో ఆటపట్టించాలి బిందెలో ఉంగరం వెతికేప్పుడు అయ్యగారిని ముప్పుతిప్పలు పెట్టాలి .చెల్లి పెళ్లివేడుకల గురించి ఊహల్లో తేలిపోతూ ఆళ్లు చెబుతున్నాను ఇంట్లోంచి పెడబొబ్బలు, హాహాకారాలు వినిపిస్తున్నాయ్ ఇంటి నిండా సాయుధులున్నారు స్వర్గారోహణంచేస్తూ ఒక్క మురికికాల్వలో పడిపోయినట్లైంది లోపలికి పరుగెత్తబోయాను ప్రాణ స్నేహితులు కరీం, జహంగీరులు చెరోరెక్కపట్టి ఆపేశారు విడిపించుకోవాలని పెనుగులాడాను లాభంలేదు.

"వద్దురా రమేష్ వద్దు, ప్లీజ్ వాళ్లకుకనబడొద్దు.." కరీం వారించాడు.

"వాళ్లు నరరూపరాక్షసులు, జీహాద్సైనికులురా! కనీసం నీప్రాణాలన్నా దక్కించుకోరా!" జహంగీర్ కంటతడితో పక్కకు తాక్కెళ్లాడు. అంతరాళాల్లో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి జరుగుతున్న ఘోరాన్ని కళ్లారా చూస్తున్నాను.

మొదట మా వదినను జుట్టుబట్టి బయటికి లాక్కొచ్చారు. భయంకరంగా నవ్వుతూ, జడ కత్తిరించారు ఒంటి మీద నూలుపోగులేకుండా చేశారు. చురకత్తులతో బరబర స్తనాలు కోసేవారు. అదే కత్తుల్ని మర్మాంగములో దించేశారు. వదిన అంగలార్పులు, హాహాకారాలు వర్ణనాతీతం. ఉక్కుహస్తాల్లో నలిగిపోతున్న అన్నయ్య, చెల్లినోళ్లు మూసిఉంచారు. శక్తిమేరకు అరుస్తూ వదిన కాళ్లూ చేతులు కొట్టుకుంటూ అన్నయ్యవైపు చూసింది

'న్నే. ... ను చెబితే విన్నారా? మ్మీ.. . మీర . న్నా "నిస్తేజమై ప్రాణాలొదిలింది.

తర్వాత చెల్లి గుడ్డలొలిచేశారు కర్ణకఠోరంగా నవ్వుతూ తుపాకి మడమలతో బాదారు మానరక్షణ కోసం.. తోడేళ్ల గుంపులో మేకపిల్లల్లా అరుస్తూ చెల్లి అటూ ఇటూ పరుగెత్తింది ఇది కలియుగం గదా! నాచెల్లి పిలుపు ఏకృష్ణుడూ వినలేదు ఎవ్వరూ ఆదుకోలేదు ఒకరి తర్వాత ఒకరు పాశవికంగా మానభంగం చేశారు అల్లాను తలుస్తూనే చెల్లి శరీరాన్ని ముక్కలుగా నరికేశారు దానవత్వం దాహం ముందు మానమాత్వం మచ్చుకైనా మిగలలేదు. బయటికి లాక్కొచ్చి అన్నయ్య కాళ్లూ చేతులు నరికేసి ఇల్లంతా దోచుకున్నారు చివరికి ఇంటికి నిప్పుపెట్టి విజయగర్వంతో వెళ్లిపోయారు.

గుండెలు బాదుకున్నాను నేలమీద పడిబొర్లుతూ లబలబలాడాను. నావాళ్లకు అంత్యక్రియలు చేసే అవకాశం గూడాలేదు సర్వస్వం కోల్పోయాను. అందాల కాశ్మీర్లోని ఆకుపచ్చమంటలు మాబతుకుల్ని కుక్కలు చింపిన విస్తరి చేసేసినై. నిర్ధాక్షిణ్యంగా కాల్చిపారేసినై. రాత్రయేదాక కుళ్ళి కుళ్లి ఏడ్చాను. "ఇక్కడ నాకెవరున్నారు? ఏముంది?" మిత్రులనడిగాను

"వెంటనే నువ్విక్కడనుండి వెళ్లిపోరా!" కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ కరీం, జహంగీరు సలహాపడేసి వెళ్లిపోయారు. ఆ ధారుణ మారణహోమం కళ్లల్లో తిరిగినప్పుడల్లా పిచ్చివాణ్నైపోతాను..." కంటి ధారల్ని లుంగీతో అద్దుకున్నాడు.

"అక్కడ రైలెక్కి వరంగల్‌లో దిగాను. అక్కడ బస్సెక్కి ఈ సిద్ధిపేటలో దిగాను ఇది మానాన్నపుట్టిన ఊరు. సిద్ధిపేట గురించి పారుపల్లి వీధి గురించి మానాన్న అప్పుడప్పుడు .... సగర్వంగా చెప్పేవాడు ఇక్కడ మా బంధువులెవరున్నా ఉండొచ్చనుకున్నాను మొదటి రోజు బస్టాండు ఆశ్రయమిచ్చింది. మర్నాడు అతికష్టమ్మీద ఈ అద్దెఇల్లు దొరికింది చాయ తయారు చేయడములో మా వదిన నిష్ణాతురాలు ఆమె చేతి చాయ అద్భుతం అనాడు సరదాగా నేర్పించిది ఈరోజదే అన్నంబెడుతోంది జీతం లొంచిమిగిలిన డబ్బులు చాయసామాగ్రి కొనిచ్చినై.."

కాసేపు మూగమనుషుల మయాము

"మీనాన్న పేరేమిటో!" వెంకయ్య ఆసక్తి

"వి నారాయణ ..."

"వి. అంటే .. ..." ఆసక్తి రెట్టింపైంది.

"వేప నారాయణ పారుపల్లి వీధేనటా "

"వ్వె. వే. .వేప నారాయణనా? వెంకయ్య మొహంనిండా వేయిదీపాల వెలుగు. "అతడు నా మేనత్త కొడుకే నా బావనే చిన్నతనములో కలిసి ఆడుకున్నాం.. బతుకుదెరువుకోసం హైద్రాబాదెళ్లాక మళ్లీ కనబడలేదు.. " గబుక్కున లేచి రమేష్ చేతులందుకుని కళ్లకద్దుకున్నాడు." అయితే.. నువు మా మేనల్లునివన్న మాటా..." తుండు గుడ్డతో రమేష్ మొహం అద్ది నుదురు ముద్దాడాడు.

ఎప్పుడొచ్చిందో ఏమో... గడపలో నుంచున్న గంగ చెంపలు కెంపులైపోయినై.

(జాగృతి - 13-8-2001)

